క్లుప్తంగా

నేడు 5కే రన్

కేయూ క్యాంపస్: పార్లమెంట్ ఎన్నికలను పురస్కరించుకొని ఓటరు చైతన్య కార్యక్రమంలో భాగంగా ఓట్ ఫర్ ష్యూర్ అనే స్లోగన్‌తో ఎన్నికల జిల్లా అధికారులు ఈనెల 5న ఉదయం 6గంటలకు హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం వద్ద 5కే రన్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈమేరకు యూనివర్సిటీ టీచింగ్, నాన్ టీచింగ్ ఉద్యోగులు, విద్యార్థులు రన్‌లో పాల్గొనాలని కాకతీయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మల్లారెడ్డి తెలిపారు. జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం నుంచి హనుమకొండ కలెక్టరేట్ వరకు 5కే రన్ కొనసాగనుంది.

నేడు మెగా రక్తదాన శిబిరం

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తలసేమియా వ్యాధిగ్రస్తులైన పిల్లలకు సహాయార్థంగా ఈనెల 5న ఉదయం క్యాంపస్‌లోని స్పోర్ట్స్ బిల్డింగ్, క్రీడామైదానం వద్ద మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించనున్నట్లు వాకర్స్ ఇంటర్నేషనల్ చీఫ్ కోఆర్డినేటర్ లక్ష్మీనారాయణ, కేయూ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు శంకర్ శనివారం తెలిపారు. రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు.

7న రాష్ట్రస్థాయి సదస్సు

న్యూశాయంపేట: భారత్ బచావ్ ఆధ్వర్యంలో ఈనెల 7న హనుమకొండ సుబేదారిలో జరగనున్న రాష్ట్రస్థాయి సదస్సును జయప్రదం చేయాలని భారత్ బచావో రాష్ట్ర ఆర్గనైజర్ డాక్టర్ రాజ్‌మహ్మద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. హనుమకొండ సుబేదారి అసుంత భవన్‌లో మంగళవారం జరగనున్న సదస్సులో రచయిత, ఎకానమిస్ట్ పరకాల ప్రభాకర్, తెలంగాణ జనసమితి రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం, భారత్ బచావో జాతీయ నాయకుడు డాక్టర్ గోపినాథ్, ఉద్యమకారులు గాదె ఇన్నయ్య హాజరవుతారని పేర్కొన్నారు.

యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధిగా వినోద్ లోక్‌నాయక్



కేయూ క్యాంపస్: భారతీయ యువజన కాంగ్రెస్ తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధిగా కాకతీయ యూనివర్సిటీ విద్యార్థి, తెలంగాణ ఉద్యమకారుడు వినోద్ లోక్‌నాయక్ నియమితులయ్యారు. ఈమేరకు ఢిల్లీ ఏఐసీసీ కార్యాలయం నుంచి యువజన కాంగ్రెస్ జాతీయ కార్యదర్శి రోష్మిజైస్వాల్ ఉత్తర్వులు జారీ చేసినట్లు వినోద్ లోక్‌నాయక్ శనివారం తెలిపారు.

అనుమతి లేని కళాశాలలపై చర్య తీసుకోవాలి

విద్యారణ్యపురి: అనుమతి లేకుండా అకాడమీల పేరుతో పలు జూనియర్ కళాశాలలు హనుమకొండలో నడుతున్నాయని, అలాంటి కళాశాలలపై చర్యలు తీసుకోవాలని స్వేరోస్ స్టూడెంట్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఎల్తూరి సాయికుమార్, బాధ్యులు అభిషేక్, ఉదయ్, సాయి, హరీష్ శనివారం ఒక ప్రకటనలో కోరారు. వేసవిలో ఎండలు మండుతున్నా తరగతులు నిర్వహిస్తున్న యజమాన్యాలపై చర్య తీసుకోవాలని తెలిపారు.

2కిలోల గంజాయి స్వాధీనం



ఖిలా వరంగల్: వాహన తనిఖీల్లో 2 కిలోల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకుని, ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ మల్లయ్య తెలిపారు. మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్‌లో ఎస్సైలు మహిమూద్, గోవర్ధన్, మున్నీరుల్లాతో కలిసి కేసు వివరాలను ఇన్‌స్పెక్టర్ శనివారం వెల్లడించారు. ఖిలా వరంగల్ పెట్రోల్ బంక్ జంక్షన్‌లో ఎస్సై మహిమూద్ వాహన తనిఖీలు చేస్తుండగా అనుమానాస్పదంగా కనిపించిన ముగ్గురు వ్యక్తుల్లో వరంగల్ శివనగర్ సాయిబాబా గుడి ప్రాంతానికి చెందిన కలకోట్ల చరణ్ పట్టుపడగా.. ఆదిత్య, అనిల్ ఇద్దరు పరారయ్యారు. ఈమేరకు చరణ్‌ను రిమాండ్‌కు తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ మల్లయ్య తెలిపారు.

రైల్వే డీఎంఈకి సన్మానం

కాజీపేట రూరల్: కాజీపేట డీజిల్ లోకోషెడ్ సీనియర్ డీఎంఈ ఎ.స్వరాజ్‌కుమార్‌ను రైల్వే రిటైర్డ్ ఎంప్లాయీస్ నాయకులు శనివారం మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. ఇటీవల డీజిల్ లోకోషెడ్‌కు రైల్వే బోర్డు అవార్డు వచ్చినందున ఆయనను నాయకులు సీహెచ్.కొమ్మాలు, కోండ్ర రాజన్‌బాబు, మల్లయ్య అభినందించారు.

రైలు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

కాశిబుగ్గ: దైవ దర్శనానికి వెళ్లి వస్తూ ప్రమాదవశాత్తు రైలునుంచి జారిపడిన యువకుడు దుర్మరణం చెందిన ఘటన ఎల్గూరు – నెక్కొండ రైల్వేస్టేషన్ల మధ్య శనివారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. జీఆర్పీ సీఐ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం మహారాష్ట్ర జల్నా జిల్లా పార్టూరుకు చెందిన సచిన్ బీస్ (26)తన మిత్రులతో కలిసి ఈనెల 1వ తేదీన తిరుపతికి దర్శనానికి వెళ్లారు. అనంతరం తిరుగు ప్రయాణంలో పద్మావతి ఎక్స్‌ప్రెస్‌లో వస్తుండగా రైలు నుంచి జారిపడడంతో తీవ్రగాయాలపాలై మృతి చెందినట్లు సీఐ వివరించారు.

దేవాలయాల్లో ప్రత్యేక పూజలు

మడికొండ: ఏకాదశి సందర్భంగా మెట్టుగుట్టపై ఉన్న శ్రీరామకోటి స్తూపానికి శనివారం ప్రత్యేక అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం రామకోటి పుస్తకాలను అందులో నిక్షిప్తం చేశారు. ఈ కార్యక్రమం ప్రతీ ఏకాదశి రోజు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో అర్చకుడు విష్ణువర్ధనాచార్యులు, కార్యనిర్వాహణాధికారి శేషభారతి, ధర్మకర్తలు బైరి రాజు, దండిగం శ్రీనివాస్, రోడ్డ దయాకర్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



మడికొండ: స్తూపానికి పూజలు చేస్తున్న భక్తులు



శ్వేతార్క ఆలయంలో..



ప్రత్యేక అలంకరణలో..

శ్వేతార్క ఆలయంలో వరుణ హోమం

కాజీపేట: కాజీపేట స్వయంభూ శ్వేతార్క మూలగణపతి దివ్యక్షేత్రంలో వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య శనివారం వరుణ హోమం నిర్వహించారు. ఆలయ వైదిక కార్యక్రమాల నిర్వాహకుడు అయినవోలు రాధాకృష్ణ శర్మ ఆధ్వర్యంలో రోహిత్ ఉపాధ్యాయ వరుణహోమం జరిపించారు.

ప్రసన్నాంజనేయ స్వామికి అభిషేకం

హన్మకొండ అర్బన్: పద్మాక్షి కాలనీలోని హనుమద్గిరి ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో శనివారం పంచామృత అభిషేకం, చందన సేవ, అర్చన, అలంకరణ గోత్రం నామార్చనలు నిర్వహించినట్లు ఆలయ అర్చకుడు ఆరుట్ల రామాచారి తెలిపారు. అనంతరం భక్తులకు అన్నదానం చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో అన్నదాన కమిటీ అధ్యక్షుడు గందె కృష్ణ, ప్రధాన కార్యదర్శి కనుకుంట్ల రవికుమార్, దశరథ్ కుమార్, మాదాసు మొగులయ్య, గంద్రతి సుధాకర్ పాల్గొన్నారు.

బాధిత మహిళలకు అండగా 'సఖి'

హన్మకొండ అర్బన్: బాధిత మహిళలు, బాలికలకు అండగా ఉంటున్న సఖి కేంద్రం అందించే సేవలను వినియోగించుకోవాలని సఖి వన్‌స్టాప్ కేంద్రం కౌన్సిలర్ విజయలక్ష్మి సూచించారు. బాలసముద్రంలో బీసీ గర్ల్స్ హాస్టల్‌లోని విద్యార్థులకు శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సఖి కేంద్రం కౌన్సెలర్ విజయలక్ష్మి మాట్లాడుతూ లైంగిక వేధింపులకు గురయ్యే చిన్న పిల్లల కోసం ప్రత్యేకమైన చట్టం 'ప్రివెన్షన్ ఆఫ్ చిల్డ్రన్ ఫ్రమ్ సెక్సువల్ యాక్ట్'ను ప్రభుత్వం తీసుకువచ్చిందని తెలిపారు. మహిళల రక్షణ కోసం గృహహింస చట్టం గురించి వివరించారు. కేస్ వర్కర్ వినీల మాట్లాడుతూ విడిపోయే భార్యభర్తలకు కౌన్సెలింగ్ ఇచ్చి ఒకటిగా కలపడం, వరకట్న వేధింపులు, లైంగిక వేధింపులు, ఆడపిల్ల వద్దని అకారణంగా గర్భవిచ్ఛితి చేయించుకోవాలని వేధింపులకు గురిచేయడం, ఇతర వేధింపుల నుంచి బాధిత మహిళలు, బాలికలకు రక్షణ కల్పించడం కోసం సఖి వన్‌స్టాప్ కేంద్రం కృషి చేస్తోందని వివరించారు. బాధితులు ఆపద సమయంలో 0870 2452112 లేదా టోల్‌ఫ్రీ నంబర్ 181కు ఫోన్ చేసి తక్షణ రక్షణ పొందాలని సూచించారు. సమావేశంలో హాస్టల్ వార్డెన్ జయలక్ష్మి, సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విజయలక్ష్మి

పది ఫలితాల్లో 'కీస్' ప్రతిభ



రామన్నపేట: వరంగల్ మట్టివాడలోని కీస్ హైస్కూల్ విద్యార్థులు పదవ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించినట్లు పాఠశాల కరస్పాండెంట్ యాదా విద్యాసాగర్ తెలిపారు. కె.వికాస్ హర్ష 10 జీపీఏ, అభిరామ్ 9.8 జీపీఏ సాధించినట్లు వివరించారు. అలాగే, 50 శాతం మంది విద్యార్థులు 9.0 జీపీఏతో ఉత్తీర్ణత సాధించినట్లు పేర్కొన్నారు. ఈమేరకు ఆ విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

పులిహోర, మజ్జిగ పంపిణీ

వరంగల్ చౌరస్తా: ఉమ్మడి వరంగల్ ఆర్యవైశ్య మిత్ర బృందం ఆధ్వర్యంలో మేదరివాడలో శనివారం అన్నదానం, మజ్జిగ పంపిణీ చేశారు. బాటసారులు, కార్మికులు, వ్యాపారులకు మజ్జిగ, పులిహోర, అరటిపండ్లు అందజేశారు. కార్యక్రమంలో మిత్ర బృందం అధ్యక్షుడు దుబ్బ శ్రీనివాస్, పాల మురళీధర్, అల్లాడి వీరభద్రయ్య, చిన్నాల సురేష్ యాదవ్, శ్రీనివాస్, మిత్తింటి సురేందర్, జంధ్యం కరుణాకర్, సుశాంత్, నాగమల సతీష్, ధనలక్ష్మి, సంపూర్ణ, జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

సీకేఎం ఆస్పత్రిలో మజ్జిగ..

కాశిబుగ్గ: జనయేత్రి ఫౌండేషన్ ఆధ్వర్యంలో వరంగల్ సీకేఎం ఆస్పత్రిలో మజ్జిగ ప్యాకెట్లను శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ వరంగల్ అధ్యక్షుడు మహమ్మద్ రహీంఖాన్ మాట్లాడుతూ ఎండల దృష్ట్యా రోగులు, వారి సహాయకులకు మజ్జిగ ప్యాకెట్లు అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు మహేష్, సమీర్, పవన్‌కుమార్, షరీఫ్ ఉన్నారు.

పిల్లలకు వాహనాలిస్తే చర్యలు

రామన్నపేట: తల్లిదండ్రులు తమ మైనర్ బాలురకు వాహనం అప్పగిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని వరంగల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్ తెలిపారు. శుక్రవారం నిర్వహించిన తనిఖీల్లో 18 మంది మైనర్లు వాహనాలు నడుపుతూ పోలీసులకు పట్టుబడినట్లు పేర్కొన్నారు.

ఎన్నికల్లో ఇబ్బందులు కలిగిస్తే చర్యలు



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఏసీపీ

రామన్నపేట: పార్లమెంట్ ఎన్నికల్లో ఇబ్బందులు సృష్టిస్తే చర్యలు తప్పవని రౌడీషీటర్లను వరంగల్ ఏసీపీ నందిరాం నాయక్ హెచ్చరించారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. మట్టెవాడ, ఇంతేజార్ గంజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు ఏసీపీ కార్యాలయంలో శనివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. రౌడీషీటర్ల జీవన విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో మట్టెవాడ ఇన్‌స్పెక్టర్ గోపి, ఇంతేజార్ గంజ్ ఇన్‌స్పెక్టర్ శివకుమార్, తదితరులు ఉన్నారు.

బ్రహ్మోత్సవాల కరపత్రాల ఆవిష్కరణ

హన్మకొండ అర్బన్: ఈనెల 9నుంచి 20వ తేదీ వరకు భద్రకాళి, భద్రేశ్వరుల కల్యాణ బ్రహ్మోత్సవాల్లో మొదటి రోజు గురువారం ఉదయం గణపతి సేవ, సాయంకాలం సుబ్రహ్మణ్య సేవల దాతలుగా ఉమ్మడి వరంగల్ జిల్లా మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కటకం పెంటయ్య తెలిపారు. ఈమేరకు నగరంలోని ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో కల్యాణ బ్రహ్మోత్సవాల కరపత్రాలను శనివారం ఆవిష్కరించారు. మొదటి రోజు సంఘం తరుపున నిర్వహించే కార్యక్రమాలకు మున్నూరుకాపు కులస్తులు హాజరుకావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘం పశ్చిమ నియోజకవర్గ కోఆర్డినేటర్ కనుకుంట్ల రవికుమార్, మాదాసు మొగులయ్య, దశరథ్‌కుమార్, గంద్రతి సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సంఘం నాయకులు

రోహిత్ వేముల కేసును పునర్విచారించాలి



సమావేశంలో మాట్లాడుతున్న గణేష్

కేయూ క్యాంపస్: ఏడేళ్ల క్రితం హెచ్‌సీయూలో పీహెచ్‌డీ స్కాలర్ అయిన రోహిత్ వేముల ఆత్మహత్య చేసుకున్న కేసుపై పునర్విచారణ జరపాలని ప్రగతిశీల ప్రజాస్వామిక విద్యార్థి సంఘం కాకతీయ యూనివర్సిటీ కార్యవర్గం డిమాండ్ చేస్తున్నట్లు పీడీఎస్‌యూ కేయూ అధ్యక్షుడు ఉడుత గణేష్ అన్నారు. కేయూలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కోర్టులో విచారణ సందర్భంగా రోహిత్ వేముల ఎస్సీ కాదని పోలీసులు రిపోర్టు సమర్పించారని, ఈక్రమంలో ఆ కేసును మళ్లీ పునర్విచారణ జరపాల్సిన అవసరం ఉందని తాము డిమాండ్ చేస్తున్నామన్నారు. సమావేశంలో పీడీఎస్‌యూ కేయూ ప్రధాన కార్యదర్శి మర్రి మహేష్, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు సన్మానం

కాజీపేట రూరల్: పదవ తరగతి ఫలితాల్లో ఉత్తీర్ణులైన కాజీపేట దర్గా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను హెడ్‌మాస్టర్ ఎస్ఎంఎం.స్వామి, ఉపాధ్యాయులు శనివారం సన్మానించారు. 9.7 జీపీఏతో మండల టాపర్‌గా నిలిచిన నిషాత్ బేగం, 8.7 జీపీఏ సాధించిన పి.చరణ్‌తేజను అభినందించారు. కార్యక్రమంలో స్టాఫ్ సెక్రటరీ కటుకూరి శ్రీనివాస్, ఉపాధ్యాయులు సంతోష్‌కుమారి, సుమలత, సతీష్‌పాల్, సునీత, మహేష్, ఎస్సీ అంబప్రసాద్, పూర్వ విద్యార్థి, కవి రాజ్‌మోహన్ పాల్గొన్నారు. కాగా, పాఠశాలలో పదవ తరగతిలో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన విద్యార్థులకు పాఠశాల పూర్వ ఉపాధ్యాయులు రవీందర్, అంబప్రసాద్ రూ.7 వేల నగదు బహుమతి అందజేశారు.



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

విద్యార్థుల క్షేత్ర పర్యటన

హన్మకొండ అర్బన్: నగరంలోని కేఎల్ఎన్ రెడ్డి కాలనీలోని రామకృష్ణ సేవా సమితిలో ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాల సంస్కార్ సమ్మర్ క్యాంప్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల క్షేత్ర పర్యటన కోసం కలెక్టరేట్‌ను శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టరేట్‌లోని వివిధ విభాగాలను పరిశీలించి, అధికారులతో మాట్లాడారు. అనంతరం డీఆర్‌ఓ వైవీ.గణేష్ చాంబర్‌లో పరిపాలన విషయాలను విద్యార్థులు తెలుసుకున్నారు. జిల్లా ఖజానా అధికారి రాజు, డీఆర్‌డీఓ నాగపద్మజ, అధికారులు పలు విషయాల గురించి వివరించారు.



కలెక్టరేట్‌ను సందర్శించిన విద్యార్థులు

'మొహబ్బత్ కీ దుకాన్'

కేయూ క్యాంపస్: ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు పల్లకొండ సతీష్ ఆధ్వర్యంలో కాకతీయ యూనివర్సిటీ గేట్ ఎదురుగా మొహబ్బత్ కీ దుకాన్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈమేరకు న్యాయ్ యువ పత్రాలను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి ఇవ్వకుండా మోసం చేసిందని విమర్శించారు. కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే యువతకు కలిగే ప్రయోజనాలను ఈ సందర్భంగా వివరించారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర సెక్రటరీ, రాష్ట్ర ఎన్ఎస్‌యూఐ సోషల్ మీడియా చైర్మన్ మనోజ్, ఎన్ఎస్‌యూఐ జిల్లా జనరల్ సెక్రటరీ సాయిరెడ్డి, సెక్రటరీ రాకేష్ పాల్గొన్నారు.

చురుగ్గా సాగుతున్న హోం ఓటింగ్

కాజీపేట: కాజీపేట పట్టణంలోని మూడు డివిజన్లలో హోం ఓటింగ్ చురుగ్గా సాగుతోంది. వయోవృద్ధులు, దివ్యాంగులు ఓటింగ్ కేంద్రాలకు వచ్చి ఓటు వేయడం క్లిష్టంగా ఉందనే భావనతో కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశం మేరకు ముందస్తుగా గుర్తించిన ఓటర్ల ఇళ్ల వద్దకు అధికారులు వెళ్లి బ్యాలెట్ పద్ధతిలో ఓట్లు వేయిస్తున్నారు. కాజీపేట పట్టణంలోని 47, 62, 63వ డివిజన్లలో 52 మందిని గుర్తించగా శనివారం 30మంది వృద్ధులు, దివ్యాంగులు తమ ఓటు హక్కును అధికారుల సమక్షంలో వినియోగించుకున్నారు. కార్యక్రమంలో పీఓ ఎస్.విజయ్‌కుమార్, ఏపీఓ కె.వాసవి తదితరులు పాల్గొన్నారు.



హోం ఓటింగ్ వేయిస్తున్న అధికారులు

కాజీపేట అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి

కాజీపేట: గత ప్రభుత్వ పాలనలో అన్ని రంగాల్లోనూ పూర్తిగా వెనుకబడిపోయిన కాజీపేట ప్రాంతాన్ని అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పనిచేయడానికి ప్రత్యేక కార్యాచరణను రూపొందించినట్లు డీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. కాజీపేట మీడియా పాయింట్ ఆవరణలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పదేళ్ల పాటు అధికారాన్ని అనుభవించిన నాయకులు.. నియోజకవర్గానికి తెచ్చిన నిధులు శూన్యమని విమర్శించారు. లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి ఓటేసి కడియం కావ్యను ఎంపీగా గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో కార్పొరేటర్లు విజయశ్రీ, జక్కుల రవీందర్ యాదవ్, ఎలకంటి రాములు, నాయకులు సుంచు అశోక్, గుంటి కుమార్, ఎండీ.అంకూస్, సయ్యద్ రజాలీ, ఆంజనేయులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి కావ్య ప్రచారం

కాజీపేట: కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి కడియం కావ్య శనివారం ఇంటింటి పాదయాత్ర నిర్వహించారు. కాజీపేట 62వ డివిజన్‌లోని పలు కాలనీల్లోని ప్రజలను కలిసి చేతి గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. ప్రచారంలో కార్పొరేటర్లు జక్కుల రవీందర్ యాదవ్, విజయశ్రీ రజాలీ, ఎలకంటి రాములు, నాయకులు గుంటి కుమార్, ఎండీ.అంకూస్, జక్కుల రమ తదితరులు పాల్గొన్నారు.



ప్రచారం నిర్వహిస్తున్న కావ్య, తదితరులు

కావ్య గెలుపునకు ఇంటింటా ప్రచారం

వరంగల్ చౌరస్తా: కడియం కావ్యను గెలిపించాలని వరంగల్ 27వ డివిజన్‌లో నాయకులు శనివారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి మీసాల ప్రకాశ్, కాంగ్రెస్ ఎస్సీ సెల్ కన్వీనర్ బాషపాక సదానందం, నాయకులు గుండేటి శ్యాంకుమార్, ఎర్రం కమల్, గుల్లపల్లి రామకృష్ణ, సర్దార్ జస్వీర్ సింగ్, గూడ శారద, మంద శ్రీనివాస్, విశాల్ బాబు, అన్వేష్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు ఏఐకేఎస్ మద్దతు

ఖిలా వరంగల్: కడియం కావ్యకు అఖిల భారత కిసాన్ సభ (ఏఐకేఎస్) మద్దతు తెలుపుతున్నట్లు తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం కార్యదర్శి వీరగోని శంకరయ్య తెలిపారు. ఈమేరకు వరంగల్ శివనగర్‌లోని సీపీఐ తమ్మెర భవనంలో ఎంఏ పాషా అధ్యక్షతన జరిగిన సమావేశంలో కోట సారయ్య, శోభ, రాజారాం, రత్నాకర్‌రెడ్డి, బొడ్డుపల్లి సాయిలు, హేమలత, మల్లారెడ్డి, యకూబ్ పాల్గొన్నారు.

బీజేపీతోనే దేశాభివృద్ధి సాధ్యం



ఓటు అభ్యర్థిస్తున్న కార్పొరేటర్ అభినవ్‌భాస్కర్

హన్మకొండ అర్బన్: కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉంటేనే దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని కార్పొరేటర్ దాస్యం అభినవ్ భాస్కర్ అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా పార్టీ వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి అరూరి రమేష్‌కు మద్దతుగా నగరంలోని 60వ డివిజన్ వడ్డేపల్లిలో చింతచెట్టు నుంచి మిడిదొడ్డి వాడ వరకు శనివారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కమలం పువ్వు గుర్తుకే ఓటు వేసి అరూరి రమేష్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు సతీష్, రాజిరెడ్డి, నాయకులు రామరాజు, యాదగిరి, అడప రాము, ప్రవీణ్, నరేష్, బాబీ, చందు, శివ, శ్రీకాంత్, రమేష్, శ్రుతి, నిరీష పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

ఎమ్మెల్యే కడియం శ్రీహరిని కలిసిన అరుంధతి సంఘం నాయకులు

కాజీపేట రూరల్: స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిని కాజీపేట అరుంధతి మాదిగ కుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు సిలువేరు విజయభాస్కర్ ఆధ్వర్యంలో పలువురు నాయకులు శనివారం కలిశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి కడియం కావ్యకు సంపూర్ణ మద్దతు తెలుపుతూ లేఖ అందజేశారు. కార్యక్రమంలో అరుంధతి సంఘం నాయకులు గోల్కొండ రాంబాబు, భూషపాక శ్రీనివాస్, సల్లూరి నాగేశ్వర్‌రావు, జెరిపోతుల వెంకటేశ్వర్లు, మాతంగి స్వామి, సిలువేరు కిరణ్‌ప్రసాద్, కాళేశ్వరపు రేణుక, మాలతి, ఈశ్వరమ్మ, జ్యోతి, భాగ్య, అన్వేష్, కిషోర్, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో ప్రజా వ్యతిరేక పాలన

హసన్‌పర్తి: కాంగ్రెస్‌ది ప్రజా వ్యతిరేక పాలన అని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బండి రజనీకుమార్ అన్నారు. హసన్‌పర్తి మండలంలోని పలు గ్రామాల బూత్ కమిటీల సమావేశం శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ వరంగల్ ఎంపీ అభ్యర్థి సుధీర్‌కుమార్ గెలుపునకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని సూచించారు. సమావేశంలో నాగారం మాజీ సర్పంచ్ రఘు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌వి మోసపూరిత వాగ్దానాలు

న్యూశాయంపేట: కాంగ్రెస్ పార్టీ మోసపూరిత వాగ్దానాలతో గద్దెనెక్కిందని, ప్రజలు దాన్ని గుర్తించి పార్లమెంట్ ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పబోతున్నారని బీఆర్ఎస్ నాయకుడు సయ్యద్ మసూద్ అన్నారు. పార్టీ అభ్యర్థి డాక్టర్ సుధీర్‌కుమార్ గెలుపుకోసం నగరంలోని చింతల్ 36వ డివిజన్‌లో శనివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో షర్ఫొద్దీన్, రాజ్‌కుమార్, బాలరాజు, మాసూక్, జంపయ్య, మోహిన్, గణేశ్, నవీన్, సాజిద్, ఐలయ్య, అంకుశ్, అనిల్, ముజ్జు, శ్రీను, ప్రణీత్, రజినీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుల బైండోవర్

కాజీపేట: కాజీపేట తహసీల్దార్ కార్యాలయంలో బీఆర్ఎస్ డివిజన్ నాయకులను పోలీసులు శనివారం బైండోవర్ చేశారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ముందస్తుగా 63వ డివిజన్‌కు చెందిన నాయకులను మండల కార్యాలయంలో హాజరుపర్చగా, అనంతరం వారిని వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేశారు. డివిజన్ మైనార్టీ సెల్ ఇన్‌చార్జ్ మహమూద్, శేఖర్‌తో పాటు పలువురిని హాజరుపర్చారు.

బీజేపీ బూత్ కమిటీ సమావేశం

మడికొండ: మడికొండలోని పార్టీ కార్యాలయంలో పీఏసీఎస్ దర్గా సొసైటీ అధ్యక్షుడు ఊకంటి వనంరెడ్డి ఆధ్వర్యంలో భారతీయ జనతా పార్టీ 46వ డివిజన్ బూత్ కమిటీ సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బూత్ స్థాయి నాయకులు, కార్యకర్తలు శక్తివంచన లేకుండా పనిచేసి పార్టీ వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి అరూరి రమేష్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు పొనగోటి వెంకట్‌రావు, కందుకూరి బాలరాజు, నాయకులు ముత్తోజు సురేష్, గడ్డం మహేందర్, బైరపాక వెంకటేష్, వినోద్, బుర్ర రాజన్‌బాబు, దార చంటి, బుర్ర నరేష్, గడ్డం కుమార్ పాల్గొన్నారు.

బీజేపీలో చేరిక

మడికొండ: 46వ డివిజన్ రాంపూర్ గ్రామానికి చెందిన పలువురు నాయకులు బీజేపీలో చేరారు. ఈమేరకు వారికి కండువాలు కప్పి పార్టీలోకి వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి అరూరి రమేష్ ఆహ్వానించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు, మునిగాల కర్ణాకర్, కట్టయ్య, నిఖిల్‌రావు, పిట్టల రమేష్, కుందురు రాజేష్‌రెడ్డి, బుర్ర రాజన్‌బాబు, వినోద్, కుమార్, నాయకులు పాల్గొన్నారు.

కేదారి యాదవ్‌కు ఎమ్మెల్సీగా అవకాశం ఇవ్వాలి



కాజీపేట: మూడున్నర దశాబ్దాలుగా రాజకీయ అనుభవంతో పాటు ఎల్ఐసీ ఏజెంట్ల సంఘంలో సుదీర్ఘకాలంగా కీలకంగా పనిచేస్తున్న కేదారి యాదవ్‌కు ఎమ్మెల్సీగా పోటీ చేసే అవకాశాన్ని బీజేపీ కల్పించాలని తెలంగాణ బీసీ బహుజన సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు ప్రతాపగిరి విజయ్ కుమార్ విజ్ఞప్తి చేశారు. ఈమేరకు కాజీపేట పట్టణంలోని రాష్ట్ర సంఘం కార్యాలయంలో ఆయన శనివారం మాట్లాడుతూ జనాభాపరంగా అధికంగా ఉన్న యాదవులకు అవకాశం కల్పించడం సముచితంగా ఉంటుందన్నారు. ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జ్ బర్కం రాంమోహన్, పాటి శేఖర్, వి.రాజ్‌నంద్, అబ్బోజు వంకర మూర్తి తదితరులు పాల్గొన్నారు.